క్లుప్తంగా

ఒన్‌టైం సెటిల్‌మెంట్‌తో రుణవిముక్తులవ్వండి..

ఉయ్యందన(క్రోసూరు): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రోసూరు బ్రాంచ్ ఆధ్వర్యాన ఉయ్యందన గ్రామంలో రుణాలు, మొండి బకాయిలపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ నుంచి అగ్రికల్చరల్ బిజినెస్ యూనిట్ డీజీఎం వి.హేమ, ఏజీఎం డి.లలిత, నరసరావుపేట రీజినల్ మేనేజర్ పి.రాధేశ్యాం, సీఎం క్రెడిట్ అధికారి రాము పాల్గొన్నారు. బ్రాంచి మేనేజర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ.. మొండిబకాయి ఖాతాదారులు వెంటనే బ్యాంక్ అదాలత్, ఒన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా రుణాలు చెల్లించి, రుణ విముక్తులు కావాలని కోరారు. మార్చి 15న వరకు బ్యాంకు ఈ అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. బాలెమర్రు గ్రామానికి చెందిన పమిడి నాగేశ్వరరావు అనే వ్యక్తి మృతి చెందగా.. అతని భార్య రూ.6.90 లక్షల రుణానికి.. రూ.4.60 లక్షలు చెల్లించి రుణ విముక్తులయినట్లు తెలిపారు. అలాగే.. బ్యాంకు నుంచి వ్యవసాయం, వ్యాపార సంస్థలకు, స్వయం సహాయక గ్రూపులకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నిర్మలబాబు, సర్పంచ్ మంకు వెంకటేశ్వర్లు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లేళ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

రామారావు మాస్టారు మృతికి నివాళి



అమరావతి: విశ్రాంత ఉపాధ్యాయుడు బచ్చు రామారావు(87) బుధవారం సాయంత్రం మరణించారు. స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సుమారు 37ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయన రామారావు మాస్టారుగా స్థానికులకు సుపరిచితుడు. రామారావు మృతదేహాన్ని మండల పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, కార్యవర్గసభ్యులు, విద్యార్థులు సందర్శించి, నివాళులర్పించారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

అమరావతి: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వైఎస్సార్ సీపీపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న ధరణికోట యుకుడిపై పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బండారు అజయ్ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులను, నాయకులను, వ్యక్తులను, పార్టీని కించపరిచే విధంగా పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టొద్దని హితవు పలికారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

చిలకలూరిపేట: తెలంగాణలోని కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థిని ధరావత్ ప్రీతి బాయి మృతి కారకులను కఠినంగా శిక్షించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జూనియర్, సీనియర్ల మధ్య వ్యత్యాసాలకు, ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు, పాలనాధికారులు పాటిస్తున్న అనాగరిక విలువలకు పరాకాష్ట ప్రీతిబాయి మృతి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెను వేధింపులకు గురి చేసిన సైఫ్‌ను ఉరి తీయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు బి.చిన్నా నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, దేవర డేవిడ్, బి రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం

నరసరావుపేట ఈస్ట్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ షేక్ ఫరూక్‌కు నరసరావుపేట ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.2.5 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. పట్టణానికి చెందిన ఫరూక్ గత నెల 25న రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం, వైద్యానికి అయ్యే ఖర్చు వివరాలు తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులు తమ మిత్రుల ద్వారా రూ.1.50 లక్షలు సేకరించగా, ఫరూక్ స్నేహితుడు బాషా మరో లక్ష రూపాయలను సేకరించాడు. ఈ మొత్తాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు మారిశెట్టి కోటేశ్వరరావు, కోశాధికారి షేక్.షఫీ తదితరులు ఆస్పత్రికి వెళ్లి ఫరూక్ కుటుంబ సభ్యులను పరామర్శించి, నగదు అందించారు. విరాళాలు సేకరణకు సహకరించిన పిడుగురాళ్ల, గుంటూరు అసోసియేషన్ ప్రతినిధులు సతీష్, అనీల్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల రేపు

ఈపూరు: ఈపూరు సమీపంలోని బోటిమీద వేంచేసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దాతల సహకారంతో దేవాలయానికి నూతన రేకుల షెడ్డు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేస్తున్నారు. సత్రాన్ని దాతలు నిర్మిస్తున్నారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.

హలో..అక్కా, నేను మీ డాక్టర్‌ని..

- అమ్మకు అండగా.. సాంకేతికత
- గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- 'కిల్కారీ' సేవలపై వైద్య సిబ్బందికి శిక్షణ
- ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ ద్వారా ఆరోగ్య సమాచార సేకరణ
- సత్తెనపల్లి డివిజన్‌లో 4,076 మంది గర్భిణుల వివరాలు నమోదు



ఫణిదం పీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ఉడతా శ్రీలక్ష్మీకవిత

సత్తెనపల్లి: ప్రతి మహిళా తన జీవితంలో మాతృత్వం ఓ వరంగా భావిస్తుంది. గర్భం ధరించినప్పటి నుంచి ప్రసవం వరకు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. తల్లీబిడ్డ సంరక్షణకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నా.. మాతాశిశు మరణాల శాతం ఆశించిన మేరకు తగ్గడం లేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యవేక్షణ కొరవడడం, వైద్య పరీక్షలు, సలహాలు, టీకాలు సరిగా అందకపోవడం దీనికి కారణంగా నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించి, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'కిల్కారి' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గర్భిణులకు సరైన సమయంలో వైద్య సేవలందేలా..సెల్‌ఫోన్ ఎప్పటికప్పుడు ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకునేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం సత్తెనపల్లి డివిజన్ పరిధిలో 4,076 మంది గర్భిణులను గుర్తించి, వివరాలు నమోదు చేశారు. 2,570 మంది బాలింతలు, 11,249 మంది ఏడాదిలోపు చిన్నారులు ఉన్నారు. గర్భం ధరించిన రెండో త్రైమాసికం నుంచి 72 వారాలు (చిన్నారికి ఏడాది వచ్చేవరకు) వారికి ఆరోగ్య సూత్రాలు వివరిస్తారు.

మీ ఆరోగ్యం ఎలా ఉంది..?

'హలో.. అక్కా, నేను మీ డాక్టర్‌ని మాట్లాడుతున్నాను. మీ ఆరోగ్యం ఎలా ఉంది..?' అనే ఆప్యాయమైన పలకరింపుతో గర్భిణులకు, బాలింతలకు ఫోన్ చేస్తారు. వారు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్ల వద్దకు వెళితే పేరు, వయసు, ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబరు, ప్రసవం తేదీ అంచనా వంటి వివరాలను ప్రభుత్వ ఆర్‌సీహెచ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. గర్భిణులకు నాలుగో నెల ప్రారంభం నుంచి కిల్కారి సేవలు (ప్రతి తల్లీ స్వీయ ఆరోగ్య సేవ) ప్రారంభమవుతాయి. గర్భిణి చెప్పే సమాధానాలు ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. కరోనా సమయంలోనూ, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన లేక కొన్నిచోట్ల మాతృ మరణాలు సంభవించాయి. మరికొందరు పౌష్టికాహారం, రక్తహీనత లోపాలతో మృత్యువాత పడుతున్నారు. ఇకపై అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

సత్తెనపల్లి డివిజన్‌లో పీహెచ్‌సీలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఇలా..

పీహెచ్‌సీ	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
ఫణిదం	684	523	931
ముప్పాళ్ళ	430	83	746
రాజుపాలెం	292	304	605
కుంకలగుంట	400	477	2,753
నకరికల్లు	278	259	2,812
75త్యాళ్ళూరు	335	58	633
అత్తలూరు	499	114	762
చంద్రాజుపాలెం	219	230	398
క్రోసూరు	447	411	729
అచ్చంపేట	492	111	880
మొత్తం	4,076	2,570	11,249

72 వారాలపాటు సేవలు..

గర్భిణుల జాబితాలో పేరు నమోదైన తర్వాత.. మూడు నెలలు నిండిన వారికి పిల్లలు పుట్టిన ఏడాది వరకు ఏ వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించే ఆరోగ్య సమాచారంతో 72 వారాల పాటు వారానికి ఒక ఆడియో చొప్పున వాయిస్ రూపంలో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనివల్ల ఆరోగ్య జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. ఫలితంగా మాతృశిశు మరణాలు తగ్గటంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవకాశం ఉంటుంది.

మాతా శిశు మరణాలు నివారించేందుకు



కిల్కారి విధానంలో మాతాశిశు మరణాలను చాలా వరకు నివారించవచ్చు. మారు మూల గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు సకాలంలో వైద్య సేవలందించేందుకు ఇది దోహదపడుతుంది. క్షేత్రస్థాయిలో సిబ్బందికి అవగాహన పెరుగుతుంది. గర్భిణికి పూర్తి అవగాహన కల్పించేలా సెల్‌ఫోన్ ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు వారి ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర నివేదిక అందించాలి. అప్పుడే వారికి సరైన వైద్య సేవలు అందుతాయి.

– పి.వెంకట్రావు, ఇన్‌చార్జి ఎంపీహెచ్‌ఈఓ, సత్తెనపల్లి డివిజన్

పాలిథిన్ కవర్ల నిషేధం తప్పనిసరి

- మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి
- సత్తెనపల్లిలో హోల్‌సేల్ దుకాణాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న కవర్లను పరిశీలిస్తున్న కమిషనర్, ఎస్‌ఐ

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణకు పాలిథిన్ కవర్లను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పేర్కొన్నారు. పట్టణంలోని పలు హోల్ సేల్ దుకాణాల్లో గురువారం దాడులు నిర్వహించి, 500 కేజీల పాలిథిన్ సంచులు, గ్లాసులు, కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 120 మైక్రాన్ల క్యారీ బ్యాగులు, కవర్లను వాడాలని స్పష్టం చేశారు. ప్రజల్లో ఇప్పటికే అనేక రూపాల్లో అవగాహన కల్పించామని, ఇకపై వాటిని విక్రయించే దుకాణాల్లో వరస దాడులు నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు. గుడ్డ, జూట్ తో తయారు చేసిన సంచులను వాడితే పర్యావరణానికి మేలు కలుగుతుందన్నారు. ఆయనతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, సెక్రటరీలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అమలకుమారి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి కోరారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పీఎండీఎస్ అవగాహన సదస్సు, ర్యాలీ గురువారం నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న అమలకుమారి పీఎండీఎస్ ప్రయోజనాలను తెలిపారు. ఘనజీవామృతం తయారీని వివరించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా జెట్టి జగదీష్ సాగుచేస్తున్న పెరటి తోటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, గ్రామ వ్యవసాయసహాయకులు ప్రియాంక, సత్తెనపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ నందకుమార్, నార్నెపాడు యూనిట్ ఇంచార్జ్ రజిని, శైలజ, ఉమ, రైతులు పాల్గొన్నారు.

మాదలలో 'పశు విజ్ఞాన బడి'



అవగాహన డీడీ నరసింహులు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు పశు విజ్ఞానబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ ఉప సర్పంచ్ యలవర్తిపాటి సైదా ప్రారంభించారు. పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు ఎస్‌సీహెచ్ నరసింహులు ముఖ్య అతిథిగా పాల్గొని, జీవాల వ్యాధులు, నివారణ చర్యలు వివరించారు. సత్తెనపల్లి సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు దేశవాలి ఆవుల్లో పిండ మార్పిడి విధానం గురించి వివరించారు. పశు వైద్య శిబిరంలో 52 గర్భకోశ పరీక్షలు, 85 జనరల్ కేసులు, నట్టల నివారణ మందు అందించారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ పశు వైద్యాధికారి వి.కరుణాకరరెడ్డి, మాదల సొసైటీ అధ్యక్షుడు ఇందూరి వెంకటరెడ్డి, చిమటా శ్రీనివాసరావు, మాదల పశు వైద్యాధికారి పుల్లారెడ్డి, మొక్కపాడు పశువైద్యాధికారి కె.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్‌ప్రసాద్, రమాదేవి, అహ్మద్, వీరబ్రహ్మం, గౌస్, రాజు, సాయి పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేస్తే.. గుర్తింపు ఖాయం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయ ప్రతాప్‌రెడ్డి

అచ్చంపేట: మంచి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని జెడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రజా సమస్యలు చర్చించేందుకు నిర్వహించే సమావేశాలకు అధికారులు గైర్హాజరైతే ఎలా అని ప్రశ్నించారు. పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే వారికోసం ప్రజా మరుగుదొడ్లు, బస్‌స్టాపు నిర్మించేందుకు తీర్మానం చేయాలని కోరారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులందరికీ మెమోలివ్వాలని ఎంపీపీ రజనీ కృష్ణానాయక్ ఆదేశించారు. కోనూరులో కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ యండ్రపల్లి నటరాజు కోరారు. వైద్యశాఖలో జవాబుదారీతనం కొరవడిందని ఉప ఎంపీపీ గంగసాని బాబు విమర్శించారు. ఇద్దరు డాక్టర్లలో ఒకరు తరచూ రాకపోవడం సరికాదన్నారు. ఎంఈఓ వి.రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, పంచాయతీరాజ్ ఏఈ శేషప్పయ్య, వ్యవసాయాధికారి సుగుణాబేగం, హౌసింగ్ ఏఈ వినోద్, ఏపీఎం సలీమ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

సత్తెనపల్లి: బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వ్యతిరేకిస్తూ సీపీఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారి పై ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కట్టా శివదుర్గారావు, గుంటుపల్లి బాలకృష్ణ, అవ్వారు ప్రసాదరావు, గద్దె ఉమశ్రీ, ధరణికోట విమల తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుల నిరసన



అమరావతి: కేంద్ర ప్రభుత్వం అనాలోచిత వైఖరితో పెంచిన పెట్రోలు, డీజిల్‌ధరలతో పాటుగా నేడు గ్యాస్ ధర సామాన్యుడికి గుదిబండగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్లో పెంచిన గ్యాస్ ధరకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నోసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో.. పేద ప్రజల జీవనంపై అధిక భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే మొహిద్దీన్ వలి, నాగుల్ మీరా, సుబ్రహ్మణ్యం, పిచ్చయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నాదెండ్ల: మండల పరిధిలోని గొరిజవోలు గ్రామంలో గురువారం ఎస్సీ కాలనీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఆరుగురు గాయాలపాలు కాగా, క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో నలుగురు మహిళలు, ఇరువురు పురుషులు ఉన్నారు. గతేడాది డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా ఇదే కాలనీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగ్గా, రెండు వర్గాలకు చెందిన 13 మందిపై కేసు నమోదుకాగా, రిమాండ్ విధించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ వై.అచ్చయ్య, యడ్లపాడు ఎస్సై రాంబాబు, సిబ్బందితో కలిసి గ్రామాన్ని చేరుకున్నారు. గ్రామంలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు.

బాలిక ఆత్మహత్య

నాదెండ్ల: కడుపునొప్పి తాళలేక ఓ బాలిక ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై ఎ.భాస్కర్ వివరాల మేరకు మండల పరిధిలోని గొరిజవోలు గ్రామంలోని జ్యోతిర్మయి స్పిన్నింగ్ మిల్లులో ఒడిషాకు చెందిన ఓ కుటుంబం గత కొన్నేళ్లుగా క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ మిల్లులో పని చేస్తోంది. ఒడిషాలోని గంజాం జిల్లా బ్రమరాపూర్‌కు చెందిన రీటాసాహు. హరిసాహు దంపతులకు నలుగురు సంతానం. తల్లిదండ్రులతో పాటూ మూడో కుమార్తె మనీషా సాహూ (16), కుమారుడు నివాసం ఉంటారు. బుధవారం ఉదయం 9 గంటలకు తల్లిదండ్రులు ఇరువురూ పనులకు వెళ్లారు. సాయంత్రం క్వార్టర్స్‌కు తిరిగి వచ్చే సరికి తలుపులు వేసి ఉండటం గమనించారు. పగలగొట్టి చూడగా.. మనీషా సాహు ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. అయితే గత కొన్ని నెలలుగా నెలసరి సమయంలో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోందని తల్లిదండ్రులు వాపోయారు. తోటి కార్మికుల సాయంతో మనీషా సాహును ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై తండ్రి హరిసాహు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గురువారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యపరచాలి

రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

మాదల(ముప్పాళ్ళ): గత మూడున్నరేళ్లలో పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను గృహసారథులు వివరించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మాదల గ్రామంలో మండల పరిధిలోని ఆరు గ్రామాల సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని, మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో సంక్షేమ పథకాలను ఇంత పారదర్శకంగా అందించలేదని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నంత కాలం ఎప్పుడూ కరువు తాండవిస్తుందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి వర్షాలు పడుతూ.. సాగునీరు పుష్కలంగా అందుతోందన్నారు. ఇది దేవుడి నిర్ణయమన్నారు. అనైతికంగా రాజకీయం చేస్తున్న వారిని ఎందుకు గౌరవించాలని, అదే రీతిలో సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. మూకుమ్మడిగా వచ్చినా.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ చేతిలో ఆయా రాజకీయ పార్టీలకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. శిక్షణ కార్యక్రమానికి మండలంలోని మాదల, రుద్రవరం, బొల్లవరం, తొండపి, దమ్మాలపాడు, ఇరుకుపాలెం గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీపీ మారూరి పద్మ, జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, మాదల సర్పంచ్ సింగంశెట్టి కోటేశ్వరమ్మ, మండల సచివాలయ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ సైదా, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, చిమటా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, నక్కా శ్రీనివాసరావు, కానాల పుల్లారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'భారత్ బచావో' కరపత్రాల ఆవిష్కరణ



నకరికల్లు: గుంటూరులో ఈ నెల 5న నిర్వహించనున్న భారత్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎం జిల్లా సహాయ కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. భారత్ బచావో కార్యక్రమం కరపత్రాలను స్థానిక ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ వ్యతిరేక శక్తులు నశించేందుకు.. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలని కోరారు. కుల, మత ఘర్షణలకు కారణమవుతున్న కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. కొత్తపేట సీపీఐ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాదులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కోటానాయక్, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం నాయకుడు వీరాంజనేయులు, మాల మహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదా బాల, మాజీ ఎంపీపీ కొర్రా లక్ష్మీబాయి, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి బాటలు వేస్తున్న ప్రభుత్వం

– ఎంపీపీ మేచారపు అనూరాధ



సమావేశంలో ఎంపీపీ అనురాధ, వైస్ ఎంపీపీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నకరికల్లు: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఎంపీపీ మేచారపు అనూరాధ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని స్పష్టం చేశారు. పంట నష్టపరిహారం పొందేందుకు రైతులు ఈ–క్రాప్ నమోదు, ఈ–కేవైసీ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సభ్యుల ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ గిరిధర్, ఏపీఓ ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి కె.దేవదాసు, హౌసింగ్ ఏఈ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్‌ను సద్వినియోగించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు లీలామస్తాన్

క్రోసూరు: వలస కూలీల పిల్లల చదువు కోసం ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను సద్వినియోగించుకోవాలని వెన్నెల సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు లీలామస్తాన్ కోరారు. గురువారం సొసైటీ ఆధ్వర్యంలో క్రోసూరులోని చెంచుకాలనీ ప్రాథమిక పాఠశాలలో సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లీలామస్తాన్ మాట్లాడుతూ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే తల్లిదండ్రులు తమ పిల్లలను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఇక లేదన్నారు. వారి కోసం హాస్టల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. హాస్టల్ నిర్వహణలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వెల్లడించారు. ఎంఈఓ ఏసురత్నం మాట్లాడుతూ హాస్టల్‌లో ఉచితంగా భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ జాన్ పాల్, ఉపాధ్యాయులు బి.నరసింహారెడ్డి, షేక్ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

– సత్తెనపల్లి ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు



సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న డీవై ఈఓ వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: చిన్నతనం నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గురువారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ ప్రగతికి సైన్సే పునాది అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే, శోధించే తత్వాన్ని అలవర్చుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహరావు, డీన్ గోపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.